# సాక్షి అన్నమయ్య జిల్లా

గురువారం । 5 । సెప్టెంబర్ । 2024




## శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు



ఏకశిలానగరిలోని కోదండ రామాలయంలో బుధవారం పవిత్రోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ టీటీడీ అధికారుల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ ఉత్సవాలు జరిగాయి. సీతారామ లక్ష్మణ ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలు, పుష్పమాలికలు ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. సాయంత్రం యాగశాలలో హోమాలు చేశారు. -ఒంటిమిట్ట

**మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)**

| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.270 | రూ.320 |
| రెండోరకం | రూ.200 | రూ.266 |

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 190 మెట్రిక్ టన్నులు



# సంక్షోభ హాస్టళ్లు!



లక్కిరెడ్డిపల్లె: కస్తూర్బా పాఠశాలలో డైనింగ్ హాల్ లేక ఇరుకు గదిలో నేలపై భోజనం చేస్తున్న విద్యార్థులు

అక్కడి మరుగుదొడ్లకు తలుపులు ఉండవు.. బాత్‌రూంలో కుళాయిలు ఉంటాయి... నీళ్లే రావు.. రాత్రిళ్లు నడుంవాల్చగానే పెచ్చులూడిన పైకప్పులు భయపెడతాయి.. ఇక పగిలిన కిటికీల అద్దాల నుంచి దోమలు రాత్రంతా దాడి చేస్తూనే ఉంటాయి. పేరుకే అవి సంక్షేమ హాస్టళ్లు.. ప్రభుత్వాల నిర్లక్ష్యానికి సంక్షోభంలో చిక్కుకుపోయాయి. విద్యా సంవత్సరం ప్రారంభమై నెలలు గడుస్తున్నా దుప్పట్లు రాక ఇక్కట్లు పడుతూనే ఉన్నారు. నీళ్లు..నిద్ర కరువై అల్లాడుతున్నారు. జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్.

- అన్నమయ్య జిల్లా హాస్టళ్లలో కనిపించని సౌకర్యాలు
- మదనపల్లెలో సొంత భవనాలు లేక షెడ్లలోనే హాస్టళ్లు
- మరుగుదొడ్ల పరిస్థితి మరీ అధ్వానం.. లోపించిన పారిశుద్ధ్యం
- చాలాచోట్ల ఉడికీ ఉడకని అన్నంతో విద్యార్థులకు అవస్థలు
- చెడిపోయిన మినరల్ వాటర్ ప్లాంట్లు.. సంపులు, బోరు నీళ్లే ఆధారం

సాక్షి రాయచోటి: సంక్షేమ హాస్టళ్లు సంక్షోభంలో నడుస్తున్నాయి. ప్రభుత్వాల అలసత్వం, పాలకులు పట్టించుకోకపోవడంతో సౌకర్యాల లేమితో కునారిల్లుతున్నాయి. అత్యున్నత విద్యతోపాటు ఆధునిక సౌకర్యాలతో ముందుకు సాగాల్సిన హాస్టళ్లు కుచించుకుపోతున్నాయి. విద్యార్థులు కూడా సౌకర్యాలు లేక అల్లాడిపోతున్నారు. ప్రస్తుత కాలంలో ఎక్కడ చూసినా మినరల్ వాటర్ తాగుతున్న పరిస్థితుల్లో కూడా సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నడిచే హాస్టళ్లు, కస్తూర్బా పాఠశాలల్లో అనేక సమస్యలు తిష్ట వేశాయి. బాలికలు చదివే పాఠశాలల చుట్టూ ప్రహరీలు లేకపోవడం ఒక ఎత్తయితే, మరుగుదొడ్ల పరిస్థితి మరీ అధ్వానం. పారిశుద్ధ్య దిగజారడం కళ్లెదుటే కనిపిస్తోంది. దీనికితోడు సొంత భవనాలు లేకపోవడంతో కొన్ని ప్రాంతాల్లో షెడ్ల కిందనే హాస్టళ్ల నిర్వహణతో పరిస్థితి దారుణంగా తయారైంది.

**మరుగుదొడ్లు అంటే భయం..భయం..**

సాంఘిక సంక్షేమశాఖ హాస్టళ్లు, పలు గురుకుల పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు సంబంధించి వినియోగించే మరుగుదొడ్లు అధ్వాన పరిస్థితిలో ఉన్నాయి. మదనపల్లెలో సాక్షి పరిశీలించిన సందర్భంలో హాస్టళ్లకు సంబంధించిన వాకిళ్లు అంతంత మాత్రంగా ఉండడం, పరిశుభ్రత లోపించడం స్పష్టంగా కనిపించింది. రైల్వేకోడూరు హాస్టళ్లలోనూ మరుగుదొడ్లు చాలా దారుణంగా దర్శనమిచ్చాయి. చివరికి విద్యార్థులకు మరుగుదొడ్లను కూడా శుభ్రంగా ఉంచలేని పరిస్థితి పట్ల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**సొంత భవనాలకు నోచుకోని హాస్టళ్లు**

జిల్లాలో చాలా చోట్ల ఎస్సీ,ఎస్టీ హాస్టళ్లకు సొంత భవనాలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. మదనపల్లె, రాయచోటి, పీలేరు, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో పలు హాస్టళ్లు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. మదనపల్లెలో అయితే పురాతన కాలం నాటి తరహాలో భవనం కనిపిస్తోంది. హాస్టళ్లతోపాటు కొన్ని పాఠశాలలకు చుట్టూ ప్రహరీ లేకపోవడంతో విష పురుగులు వస్తున్నాయి. రైల్వేకోడూరులో బాలికల హాస్టళ్లకు సంబంధించి ప్రహరీ లేక పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**నాణ్యమైన ఆహారం ఏదీ?**

జిల్లాలో కస్తూర్బా బాలికల హాస్టళ్లతోపాటు ఇతర హాస్టళ్లలో నాణ్యతతో కూడిన ఆహారం అందించడం లేదు. ఉడికీ ఉడకని ఆహారాన్ని అందిస్తుండడంతోపాటు మెనూ కూడా సక్రమంగా పాటించడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పౌష్టికాహారంగా అందించాల్సిన కోడిగుడ్లతో సహా ఇతర ఆహార పదార్థాలు అందడం గగనంగా మారుతోంది. ఒకటేమిటి.. ఇలా చెబుతూపోతే అనేక సమస్యలు హాస్టల్ విద్యార్థులను పట్టిపీడిస్తున్నాయి. విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలను కూడా సక్రమంగా అందించకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

| | |
|---|---|
| జిల్లాలో కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలు: | 22 |
| అందులో 6-12వ తరగతి చదువుతున్న విద్యార్థులు: | 5280 |
| జిల్లాలో సంక్షేమ వసతి గృహాలు: | 55 |
| అందులో ఉంటున్న విద్యార్థులు సుమారు: | 4000 |

### పురుగుల భోజనం.. అపరిశుభ్ర నీళ్లు



పురుగులు పట్టిన అన్నం, నీళ్ల సాంబారు



నీళ్లసంపులో దర్శనమిస్తున్న బల్లి

చాలీ చాలని ఆహారం.. అదీ పురుగులు పట్టిన అన్నం, నీళ్ల సాంబారు మాత్రమే. శుద్ధజల యంత్రం పాడై నీటి కోసం అలమటిస్తున్నా పట్టించుకోలేదు. సంపులో అపరిశుభ్రంగా ఉన్న నీరు తాగాల్సిందే. ఇదంతా ములకలచెరువు కస్తూర్బా పాఠశాలలో 250 మంది విద్యార్థుల పరిస్థితి. విద్యార్థులు భరించలేక తల్లిదండ్రులకు చెప్పడంతో వారు ఎంఈఓ వెంకటరమణ దృష్టికి తెచ్చారు. చదువుకోవాలని పంపితే ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఎంఈఓ హామీ ఇచ్చారు. - ములకలచెరువు

### ప్రహరీ నిర్మించాలి

పాఠశాల నుంచి వచ్చాక హాస్టల్‌లో జైలులో ఉన్నట్లు ఉంటుంది. ప్రహరీ లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. అలాగే తాగునీటి సౌకర్యం కల్పించాలి. - తేజోమయి, 10 వతరగతి, సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం-1, రైల్వేకోడూరు



రైల్వేకోడూరు: ప్రహరీ లేని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం-1

### తాగునీటికీ అవస్థలు



రాయచోటి గిరిజన సంక్షేమ గురుకులంలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ప్లాంట్

జిల్లాలో సాంఘిక సంక్షేమశాఖ హాస్టళ్లలో కనీసం తాగునీటికి కూడా విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా మినరల్ వాటర్ ప్లాంట్లు రాయచోటితోపాటు రైల్వేకోడూరు, పీలేరులోని హాస్టళ్లలో చెడిపోవడంతో బోరు, సంపులపైనే ఆధారపడాల్సి వస్తోంది. తంబళ్లపల్లె నియోజకవర్గంలో ములకలచెరువు గురుకుల హాస్టల్‌లో ఏకంగా సంపులోని నీటిని అందిస్తున్న వ్యవహారం వెలుగులోకి వచ్చింది. సంపులోనే బల్లులు తిరుగుతున్నాయి.



రాజంపేట బీసీ బాలుర హాస్టల్‌లో కిటికీలు లేని దృశ్యం

### దోమలు ఎక్కువగా ఉంటాయి



కిటికీలు లేక పోవడం వల్ల దోమలు ఎక్కువగా ఉంటున్నాయి. అందువల్ల వేసవి కాలంలో కూడా దోమలు కుట్టకుండా ఉండేందుకు మేము పూర్తిగా దుప్పటి కప్పుకొని నిద్రపోతాము. అయితే రాత్రి ఏదో ఒక సమయంలో దుప్పటి పక్కకు పోయినప్పుడు దోమలు కుడుతున్నాయి. చలికాలంలో విపరీతమైన చలి ఉంటుంది. కిటికీలు ఉంటే మాకు ఈ సమస్యలు ఉండవు. -యోగీశ్వర్, బీసీ బాలుర హాస్టల్ విద్యార్థి, రాజంపేట

### శుద్ధజలం లేక ఇబ్బందులు

మా పాఠశాలలో రెండు మినరల్ వాటర్ ప్లాంట్‌లు ఉన్నా రెండు కూడా పనిచేయడం లేదు. విద్యార్థులు బోర్ నీళ్లే తాగాల్సి వస్తోంది. దాతలు ముందుకు వచ్చి మరమ్మతులు చేయించాలి. వంక ఆనుకొని పాఠశాల ఉండడంతో పాములు, తేళ్లు పాఠశాలలోకి వస్తున్నాయి. ఇంటర్ విద్యార్థులు కూడా అదనంగా ఉండడంతో విద్యార్థులు కింద కుర్చునే భోజనం చేయాల్సి వస్తోంది. -నాగలక్ష్మి, ఎస్‌ఓ, కస్తూర్బాగాంధీ పాఠశాల, లక్కిరెడ్డిపల్లె మండలం



లక్కిరెడ్డిపల్లె కస్తూర్బాగాంధీ పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్

## న్యూస్‌రీల్

### గురుకులం ప్రిన్సిపల్, ఆమె భర్తకు 14 రోజుల రిమాండ్

లక్కిరెడ్డిపల్లె: అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థినిపై లైంగిక దాడి యత్నం సంఘటనకు సంబంధించి ప్రిన్సిపల్ పరిమళ, ఆమె భర్త బాలసుబ్బయ్యకు లక్కిరెడ్డిపల్లె కోర్టు 14 రోజులు జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు రాయచోటి ఇన్‌చార్జి డీఎస్పీ సుధాకర్ తెలిపారు. ఈ కేసులో బాధితురాలిని, ఆమె తల్లిదండ్రులను, పాఠశాల సిబ్బందిని, విద్యార్థులను విచారించి ప్రిన్సిపల్, ఆమె భర్తపై పోక్సోతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కోర్టు రిమాండ్ విధించడంతో కడప సెంట్రల్ జైలుకు తరలించామన్నారు.

### హుండీ ఆదాయం లెక్కింపు

చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో ఉన్న హుండీల ఆదాయాన్ని (పరకామణి) బుధవారం లెక్కించినట్లు ఆలయ సహాయ కమీషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. హుండీల మొత్తం ఆదాయం రు.37,10,681 లు వచ్చిందని ఆయన వెల్లడించారు. ఇందులో ఆలయంలోని హుండీల ద్వారా 36,48,364లు రాగా అన్నదాన సత్రం లోని హుండీ ద్వారా రు.63,317లు వచ్చిందన్నారు.అలాగే 17 మిల్లీ గ్రాముల బంగారంతో పాటు 2కిలోల వెండి వస్తువులు వచ్చినట్లు తెలిపారు. ఈ మొత్తం 55 రోజులకు సబంధించినదని తెలిపారు.

# అక్కడే చదివి.. అందరికీ గురువులై.!

- అరుదైన అవకాశం దక్కించుకున్న ఉపాధ్యాయులు
- నేడు ఉపాధ్యాయ దినోత్సవం



జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివి ఇక్కడే గురువులైన ఉపాధ్యాయులు

మదనపల్లె సిటీ: దేశ భవిష్యత్తు తరగతి గదిలో రూపుదిద్దుకుంటుందన్నది నానుడి. చిన్నప్పుడు చదివిన పాఠశాలకు తాము ఉపాధ్యాయులుగా వస్తామని వారు ఊహించి ఉండరు. ఆ అవకాశాన్ని అందిపుచ్చుకున్న కొందరు పాఠశాలల అభివృద్ధికి శ్రమిస్తున్నారు. ఇలాంటి అరుదైన అవకాశం తమకు లభించినందుకు గర్వపడుతున్నారు మదనపల్లె పట్టణం జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు. ఒకరు కాదు ఇద్దరు కాదు... ఏకంగా ఎనిమిది మంది ఉపాధ్యాయులు ఇదే పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్చుకుని నేడు పిల్లలకు పాఠాలు చెబుతున్నారు. ఇలాంటి అరుదైన సంఘటన ఏ పాఠశాలలో కన్పించదు. వసుధ (హిందీ), సునందిని (ఇంగ్లీషు), సోగ్రోని (హింది), వహిదా రహమాన్( మ్యాథ్స్), శ్రీరామచంద్ర(క్రాఫ్ట్ టీచర్), రాజారెడ్డి(మ్యాథ్స్), సహదేవ( సైన్సు), ముబారక్‌బాషా (హిందీ)లు ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. వీరిలో కొందరు ఉపాధ్యాయులు తమ మనోభావాలను పంచుకున్నారు.

### చాలా సంతోషంగా ఉంది

నేను 1977 నుంచి 1980 వరకు జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకున్నాను. అప్పట్లో విశ్రాంత ఆర్‌జేడీ ప్రభాకర్‌రెడ్డి మాకు క్లాస్‌టీచర్‌గా ఉండేవారు. అక్కడే పదో తరగతి పాసయ్యాక ఉన్నత చదువులు చదువుకుని 2017లో ఇదే పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయునిగా చేరడం చాలా సంతోషంగా ఉంది. -బి.సహదేవ, స్కూల్ అసిస్టెంట్ జీవశాస్త్రం, జెడ్పీహెచ్‌ఎస్, మదనపల్లె



పాఠం చెబుతున్న ఉపాధ్యాయుడు సహదేవ

### మంచి అవకాశం

నేను 1984 నుంచి 1987 వరకు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8 నుంచి 10 వరకు చదువుకున్నాను. అప్పట్లో హెచ్‌ఎంగా రంగనాథగుప్తా ఉండేవారు. అక్కడే పదో తరగతి పాసయ్యాక ఉన్నత విద్యాభ్యాసం అయ్యాక 1996లో ఉపాధ్యాయ వృత్తిలో చేరాను. 2017లో పదోన్నతి పొంది గణిత ఉపాధ్యాయుడిగా జెడ్పీ ఉన్నత పాఠశాలలో చేరాను. చదువుకున్న పాఠశాలలోనే ఉద్యోగం చేయడం మంచి అవకాశంగా భావిస్తున్నా. విద్యార్థులను భావిపౌరులుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నా. -సి.రాజారెడ్డి, స్కూల్ అసిస్టెంట్, గణితం, జెడ్పీహెచ్‌ఎస్, మదనపల్లె



పాఠం చెబుతున్న ఉపాధ్యాయుడు రాజారెడ్డి

### సేవలో ఆదర్శం





మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా జీవిత సాఫల్య పురస్కారం అందుకుంటున్న మహమ్మద్‌ఖాన్ (ఫైల్)

మదనపల్లె సిటీ: ఆయన చదువు చెప్పడానికే పరిమితం కాలేదు. విద్యార్థుల భవిష్యత్తుకు ఎనలేని సేవలు అందిస్తున్నారు. మైనార్టీ విద్యార్థుల విద్య కోసం ప్రత్యేక శ్రద్ధ చూపుతూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. మదనపల్లె పట్టణం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీషు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పి.మహమ్మద్‌ఖాన్ సర్వశిక్ష అభియాన్‌లో ఉర్దూ అకడమిక్ మానిటరింగ్ అధికారిగా, కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారిగా, ప్రత్యామ్నాయ పాఠశాలల సమన్వయకర్తగా పని చేశారు. బడిఈడు పిల్లలను బడిలో చేర్పించేందుకు ప్రత్యేక కృషి చేశారు. ముఖ్యంగా మైనార్టీ విద్యార్థులు, ఉర్దూభాషాభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. పేద మైనార్టీ విద్యార్థుల కోసం విద్యాసామగ్రిని వితరణ చేశారు.

**పురస్కారాలు:** గత ఏడాది రాష్ట్ర మైనార్టీ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర స్థాయి జీవిత సాఫల్య పురస్కారాన్ని నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. అంతే కాకుండా జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకున్నారు. తిరుపతిలో జరిగిన శ్రేష్ఠ గురు సంస్థ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు.

### రెండు రైళ్ల గడువు పొడిగింపు

కడప కోటిరెడ్డిసర్కిల్ : అహ్మదాబాద్ నుంచి తిరుచునాపల్లి జంక్షన్ (09419)కు ప్రతి గురువారం నడిచే రైలు డిసెంబరు 26వ తేదీ వరకు, అలాగే తిరుచునాపల్లి జంక్షన్ నుంచి అహ్మదాబాద్ వెళ్లే (09420) రైలు డిసెంబరు 29 వరకు పొడిగించారు.



# బడి భోజన పథకంలో మార్పులు

**జిల్లా కలెక్టర్ శ్రీధర్**



బడి భోజనంపై విద్యాశాఖ అధికారులతో సమీక్ష చేస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

రాయచోటి: పిల్లలందరూ ఇష్టపడి భోజనం చేసేలా నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనాన్ని వండి పెట్టాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకంపై జిల్లా విద్యాశాఖ అధికారులు, ఇస్కాన్ ప్రతినిధులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అన్నమయ్య జిల్లాలో ఇస్కాన్, ఇతర ప్రైవేటు ఏజెన్సీల ద్వారా అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకంలో ప్రస్తుతం ఉన్న ఆహార మెనూలో సోమవారం నుంచి శనివారం వరకు ఉన్న వివిధ ఆహార పదార్థాల గురించి జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాష్ రెడ్డి కలెక్టర్‌కు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకానికి సంబంధించిన మెనూలో ఏవైనా మార్పులు చేస్తే బాగుంటుందా అని ఇస్కాన్ ప్రతినిధులు, జిల్లాలోని వివిధ అధికారులను ఉద్దేశించి అడిగారు. దీనికి సమాధానంగా వివిధ మండల విద్యాధికారులు, పిల్లలు పొంగల్‌ను ఇష్టపడడం లేదని దానికి బదులుగా బియ్యంతో చేసిన భోజనాన్ని ఇష్టపడుతున్నట్లు తెలిపారు. పథకం అమలులో ఎదురవుతున్న ఇబ్బందులపై కలెక్టర్ ఆరా తీశారు. జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ ఇస్కాన్ ప్రతినిధులు చేసిన భోజనాలను వేడిగా ఉండేలా హాట్ బాక్సులలో పంపిస్తే బాగుంటుందన్నారు.

**మెనూ వివరాలు..**

అన్నం, మిరియాల రసం, వేయించిన గుడ్డు, ఆకు కూర పప్పు, సాంబార్ అన్నం, కందిపప్పు చారు, వివిధ కూరగాయల పప్పు, టమాటా రసం, స్వీట్ పొంగల్ తదితర ఆహార పదార్థాలతో సోమవారం నుంచి శనివారం వరకు నూతన మెనూను సిద్ధం చేశారు. ఈ నూతన మెనూపై కొన్ని వారాల తరువాత సమీక్ష నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్ రెడ్డి, మండల విద్యాధికారులు, ఇస్కాన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

**అంగన్‌వాడీలకు పిల్లలు వచ్చేలా చూడాలి**

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు మంచి విద్యాబుద్ధులు నేర్పాలని జిల్లా కలెక్టర శ్రీధర్ చామకూరి తెలిపారు. బుధవారం మధ్యాహ్నం రాయచోటి కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార మీటింగ్ హాల్‌లో ఐసీడీఎస్ పీడీ, సీడీపీఓలు, సూపర్‌వైజర్లతో సమీక్ష నిర్వహించారు. పిల్లలకు మంచి భోజనాన్ని అందించాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఎలాంటి అవకతవకలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకోవాలని సీడీపీఓ సూపర్‌వైజర్లకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ శశికళ, సీడీపీఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

**గ్రామ సభల్లో ఆమోదించిన పనులపై దృష్టి**

గ్రామసభలలో ఆమోదించిన పనుల మీద పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆ శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ డీఈలు, ఏఈలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తదితర సిబ్బందితో ఆ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వివిధ పనులపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో ఆ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వివిధ పనుల గురించి, మంత్రి, ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన పనుల గురించి కలెక్టర్‌కు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ జిల్లా అధికారి దయాకర్‌రెడ్డి వివరించారు.

**ఉపాధి పనుల్లో పురోగతి సాధించాలి**

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులలో పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి జిల్లా నీటియాజమాన్య సంస్థ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై సమావేశం నిర్వహించారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ మద్దిలేటి, ఏపీడీలు, ఏపీఓలు పాల్గొన్నారు.

# నేను చెప్పిందే చేయండి

**ఈఓఆర్డీలకు టీడీపీ నేత జయచంద్రారెడ్డి ఆదేశాలు**



టీడీపీ కార్యాలయంలో ఈఓఆర్డీలకు ఆదేశాలిస్తున్న జయచంద్రారెడ్డి

సాక్షి టాస్క్‌ఫోర్స్: అతను ఒక ఎమ్మెల్యే కూడా కాదు, తంబళ్లపల్లి నియోజకవర్గానికి పార్టీ ఇన్‌చార్జిగా కూడా టీడీపీ అధిష్టానం ఇంత వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. అయినా కూడా ఇన్‌చార్జి తానే అంటూ తనకు తానే ప్రచారం చేసుకున్నాడు. అతని పేరే దాసరిపల్లి జయచంద్రారెడ్డి. ములకలచెరువు మండలానికి చెందిన జయచంద్రారెడ్డి ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. అయినా కూడా ఇటీవల బదిలీలపై నియోజకవర్గంలోని పలు మండలాలకు అధికారులుగా వచ్చిన వారిని సైతం ములకలచెరువులోని పార్టీ కార్యాలయానికి పిలిపించుకుని ఎలాంటి వ్యవహారమైనా అంతా తన కనుసన్నల్లోనే జరగాలని ఆదేశాలు జారీ చేస్తుండటం గమనార్హం. ఇదిలా ఉండగా బుధవారం సాక్షి పత్రికలో 'సొమ్ము సర్కార్‌ది-పెత్తనం టీడీపీది' అనే వార్త ప్రచురితమైంది. విషయం తెలుసుకున్న జయచంద్రారెడ్డి ఆఘమేఘాలపై నియోజకవర్గంలోని ఆరు మండలాల ఈఓఆర్డీలు తన పార్టీ కార్యాలయానికి రావాలని హుకుం జారీ చేయగా బి.కొత్తకోట మినహా మిగిలిన ఐదు మండలాల అధికారులతో ఆయన సమీక్షించారు. మీ మండలాలకు 15వ ఆర్థిక సంఘం నిధులు ఎంత మంజూరైంది, వాటిని తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాల ఏర్పాటు కోసం ఖర్చు పెట్టండి, నాకు తెలియకుండా నయా పైసా బిల్లు కూడా పెట్టరాదని అధికారులను ఆదేశించినట్లు సమాచారం.